క్లుప్తంగా

నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటించనున్నట్లు సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే భూ పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని చెప్పారు.

ముత్తుకూరు: మండలంలోని దువ్వూరువారిపాళెం, డమ్మాయపాళెం పంచాయతీల్లో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు పంచాయతీల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో మంత్రి పాల్గొంటారని వివరించారు.

నేడు ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్లు మల్లారెడ్డి, సతీష్‌రెడ్డి శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి దామరమడుగు, రామచంద్రారెడ్డినగర్, రేబాలలక్ష్మీనగర్, రామచంద్రాపురం, చల్లాయపాళెం గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొంటారని వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ఆదాయ పన్ను చట్టాలపై అవగాహన



నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని రోటరీ ఆడిటోరియంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ సెంట్రల్ జోన్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. బడ్జెట్ 2024 – ఇన్‌కమ్ ట్యాక్స్, జీఎస్టీ అమెండ్‌మెంట్స్, రేరా ఇంప్లికేషన్స్ ఆన్ బిల్డర్స్‌పై చర్చను జరిపారు. ఆదాయ పన్ను, జీఎస్టీ సవరణలు, రెరా పాలసీ అంశాలను ఫెడరేషన్ వైస్ చైర్మన్, సీఏ రామకృష్ణ వివరించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, ఫెడరేషన్ సెంట్రల్ జోన్ వైస్ చైర్మన్ హొమ్మిన సతీష్‌బాబు, జనరల్ సెక్రటరీ కొండా శేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ బాబూ అగస్టీస్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ పెట్రోల్ బంక్స్ అసోసియేషన్ డైరెక్టర్ రవికుమార్ చౌదరి, కావలి శాఖ అధ్యక్షుడు వెంకట్రామయ్య, ఉపాధ్యక్షుడు పెనుబల్లి కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



నెల్లూరు రూరల్: సీనియర్ సిటిజన్లపై నిరాదరణ తగదని సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. కొత్తూరులోని నెహ్రూ భారతి వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సీనియర్ సిటిజన్లకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్న అనంతరం ఆమె మాట్లాడారు. హక్కులపై సీనియర్ సిటిజన్లకు అవగాహన అవసరమని చెప్పారు.

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అభిషేకాలు, విశేష పూజలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో తిరుప్పావై సేవను జరిపారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల సేవలు ప్రశంసనీయం



నెల్లూరు(క్రైమ్): ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్తున్న పోలీస్ అధికారుల సేవలను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కొనియాడారు. బదిలీపై వెళ్తున్న పోలీస్ అధికారులకు వీడ్కోలు సభను నగరంలోని పోలీస్ కవాతు మైదానంలో శుక్రవారం నిర్వహించారు. డీఎస్పీలు రామచంద్ర, శ్రీనివాసరావు, శివాజీరాజా, గాంధీ, ఆర్‌ఐలు శ్రీనివాసులురెడ్డి, పాల్‌రాజు, మౌలుద్దీన్, ఆర్ఎస్సైలు నారాయణరెడ్డి, కృష్ణప్రసాద్, తిరుమలరెడ్డి, నాగరాజు, చంద్రమౌళి, హరికృష్ణ, రాజశేఖర్, సురేష్‌ను ఎస్పీ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా రబీ సాగు

- వర్షాభావ పరిస్థితుల్లోనూ మండలంలో 8 వేల ఎకరాల్లో వరి నాట్లు
- అవసరాన్ని బట్టి కాలువలకు సాగునీరు విడుదల



కాలువల కింద సాగుచేస్తున్న వరి పంట

పొదలకూరు : గతేడాది మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సోమశిల, కండలేరు జలాశయాల్లోనూ నీటి నిల్వలు లేకపోవడంతో రబీ సాగుపై రైతులు ఆశలు వదిలేశారు. ఈ తరుణంలో డిసెంబరులో ఏర్పడిన మిచాంగ్ తుపాన్‌తో కురిసిన వర్షాలకు చెరువులు, జలాశయాల్లో నీరు చేరడంతో రబీ సాగుపై రైతుల్లో ఆశలు చిగురించాయి. సాగునీటి వసతి ఉన్న గ్రామాల్లో ఆలస్యంగా నాట్లు వేయగా, లేని గ్రామాల్లో సాగును వదిలేశారు. గత నాలుగేళ్లుగా వర్షాలు పుష్కలంగా కురవడంతో రబీలో 14 వేల ఎకరాల్లో సాగుచేపట్టారు. ధాన్యం దిగుబడులు, ధరలు బాగుండడంతో రైతులు లాభాలను చూసి సంతోషంగా ఉన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో 8 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. సోమశిల, కండలేరు ప్రాజెక్ట్‌ల్లో నీటి లభ్యత తక్కువగా ఉండడం వల్ల నాన్‌డెల్టా రైతులకు సాగునీటిని విడుదల చేయలేమని ఐఏబీ సమావేశంలో తీర్మానం చేశారు. ఐఏబీ తీర్మానం ప్రకారం మండలంలో కొన్ని గ్రామాలకు సాగునీటి కాలువలు ఉన్నా నీటిని విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో కనుపూరు, కండలేరు ఒకటో బ్రాంచ్ కెనాల్, కండలేరు ఏటి కాలువలతో పాటు కొన్ని గ్రామాల్లో చెరువుల కింద రైతులు వరి సాగు చేపట్టారు. సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్, వ్యవసాయాధికారులు ముందస్తుగా రైతులతో సమావేశమై పొదుపుగా సాగునీటి వినియోగించుకుంటూ పంటలను పండించుకోవాలని సూచించారు.

పంటల ఎండకుండా చర్యలు

మండలంలో సాగుచేస్తున్న రబీ పంట ఎట్టిపరిస్థితిలో ఎండనీయకుండా చర్యలు తీసుకునేందుకు మంత్రి కాకాణి ప్రయత్నిస్తున్నారు. సాగునీరందే అవకాశం ఉన్న చెరువులకు త్వరలో కండలేరు ఎడమగట్టు కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయించనున్నారు. ఇటీవల ఆర్‌వైపాళెంలో పర్యటించిన మంత్రి కాకాణి మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, సాగునీరు తగ్గితే కండలేరు ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేయిస్తామని పేర్కొన్నారు. ఫలితంగా చెరువుల కింద వరిసాగు చేస్తున్న రైతులు సాగునీరు తగ్గితే ఆఖరి తడులకు ఇబ్బందులు తలెత్తవని భావిస్తున్నారు. అయితే దీన్ని కూడా టీడీపీ నాయకులు రాజకీయం చేస్తూ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకా నీటిని విడుదల చేయలేదని పైర్లు ఎండిపోతాయని గ్రామాలకు వెళ్లిన సందర్భంగా దుష్ప్రచారం సాగిస్తున్నారు.



కనుపూరు కాలువకు విడుదల చేసిన సాగునీరు

ఆరోగ్య సురక్షకు అపూర్వ స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు

కొడవలూరు: నార్తురాజుపాళెం సచివాలయం-2లో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై 537 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నలుగురికి కంటి శస్త్ర చికిత్సలు అవశ్యం కావడంతో ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకునేలా చర్యలు తీసుకొన్నారు. కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం రామకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కావ్య, కంటి వైద్యనిపుణురాలు శశికళ, చిన్నపిల్లల వైద్య నిపుణుడు సురేష్, ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు అశ్విని వైద్యసేవలు అందించారు. కాగా ఎంపీడీఓ వీ ప్రద్యుమ్నకుమార్ ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించారు. వైద్యసేవలు అందిస్తున్న తీరుపై ఆరాతీశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈఓపీఆర్డీ వీ డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు జీ జాలయ్య, జీ రాధాకృష్ణ, శివ, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏలు షఫీ ఉద్దీన్, వెంకట్రావు, ఎంఎల్‌హెచ్‌పీలు సరోజ, స్నేహ, పద్మ, పాల్గొన్నారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా రమణబాబు



ఎమ్మెల్యే ప్రసన్నను కలిసిన నూతన కమిషనర్

కోవూరు : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా ఈవీ రమణబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల పోస్టర్లను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ బీ మాలకొండారెడ్డి, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, అల్లూరు రమణయ్య, చాట్ల కోటేశ్వరరావు, జీ మోహన్, వాసుదేవరావు, సంకల శ్రీనివాసులు, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, బాబు, వినోద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కోవూరు : మండలంలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ బీ రామాంజనేయులు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవయ్య, ఉపాధి ఏపీఓ సుబ్బారావుతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వారికి కేటాయించిన గృహ నిర్మాణాల ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అభినందన



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి

వెంకటాచలం: ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను విక్రమ సింహపురి వర్సిటీ వీసీ జీఎం సుందరవల్లి అభినందించారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొని తిరిగి వచ్చిన వీఎస్‌యూ కళాశాలకు చెందిన ఎస్ అనిత, సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కే చందన వీఎస్‌యూకు వచ్చి వీసీ జీఎం సుందరవల్లిని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరిని వీసీ అభినందించి ఢిల్లీలో జరిగిన కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లోనూ ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దానాలతో ఆత్మసంతృప్తి



పేదలకు వస్త్రదానం చేస్తున్న దృశ్యం

కోవూరు: అన్నదానం, వస్త్రదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో ఆత్మ సంతృప్తిని ఇస్తాయని ఇనమడుగు సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థ స్వామి పేర్కొన్నారు. లేగుంటపాడులోని అఖండానంద ఆశ్రమంలో నిర్మలానందస్వామి జన్మదినం, పోబోలు కొండమ్మ వర్ధంతిని పురస్కరించుకుని కుమారుడు పాబోలు రామసుబ్బయ్య, విజయమ్మ దంపతులు శుక్రవారం నిరుపేదలకు వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీహరితీర్థస్వామి మాట్లాడుతూ నిర్మలానందస్వామి నిరుపేదలకు సేవచేయడంతో పాటు వారికి మంచి విషయాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరమన్నారు. నిర్మలానందస్వామిపై గ్రామస్తులు ప్రత్యేకమైన అభిమానాన్ని చూపుతూ సహాయ సహకారాలు అందించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. కృష్ణానందస్వామి, పురుషోత్తమతీర్థ స్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు స్వామీజీలను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. సత్యానంద ఆశ్రమ కార్యదర్శి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూడకుండా విమర్శలు తగవు



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఇందుకూరుపేట: అభివృద్ధి పనులు చూడకుండా విమర్శలు చేయడం టీడీపీ నాయకుడు దినేష్‌రెడ్డికి తగదని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ హితువుపలికారు. మండలంలోని ముదివర్తిపాళెంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శిలాఫలకాలు వేయడం తప్ప, పనులు చేయరని టీడీపీ నాయకుడు దినేష్‌రెడ్డి మాట్లాడడాన్ని ఖండించారు. మీ తండ్రి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలా ఎప్పుడో నిర్మించిన రోడ్లను తానే వేయించానని, పనులు చేయకుండా చేశామని చెప్పడం తమకు చేతకాదన్నారు. మైపాడు చెరువు మైపాడుతో పాటు నరసాపురం, కొరుటూరు, సోమరాజుపల్లి గ్రామాలకు సంబంధించిందన్నారు. 2020లో చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు కాగా రూ.60 లక్షల వరకు పనులు చేపట్టినట్లు తెలిపారు. కరోనా రావడంతో పనులు నిలిచిపోయాయే తప్ప తాము చేయకుండా వదిలేయలేదన్నారు. రావూరు నుంచి గంగపట్నం వయా కొమరిక రోడ్డు, మైపాడు–కొరుటూరు రోడ్డు, మైపాడు–నెల్లూరు ప్రధాన రహదారి నుంచి పున్నూరు వరకు సిమెంటు రోడ్డు, మైపాడు నుంచి ఆరోమైలు వరకు రోడ్డు, ఇందుకూరుపేటలో ప్రభుత్వ వైద్యశాల భవన నిర్మాణ పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టినవేనని వివరించారు.

ఈ అభివృద్ధి పనులు మీకు కనిపించడం లేదా అని దినేష్‌రెడ్డిని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల అమలు తీరును ఏ ఇంటికి వెళ్లి అడిగిన చెబుతారన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్‌కు మనుబోలు విద్యార్థిని



గమనికను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మనుబోలు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని శ్రీపతి గమనిక రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం వసంతకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె ఉపాధ్యాయులతో కలిసి గమనికను అభినందించారు. వెంకన్నపాళేనికి చెందిన గమనిక బాలికల వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతోందని తెలిపారు. ఇటీవల ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ పోర్టల్ ద్వారా జిల్లా స్థాయిలో తన ప్రాజెక్ట్ లేజర్ సెక్యూర్టీ ఫర్ డోర్స్‌ను నమోదు చేసుకున్నట్లు చెప్పారు. మండలంలోని ఏడు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి గమనిక ఒక్కటే రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. గమనిక ప్రాజెక్ట్‌కు గైడ్‌గా వ్యవహరించిన సువర్ణను అభినందించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు రమేష్‌కుమార్, ప్రియాంక, కృష్ణజ్యోతి, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

జీవన ఎరువులు లాభదాయకం



జీవన ఎరువులతో సాగుచేసిన వరిని పరిశీలిస్తున్న డీఆర్సీ అధికారులు



పొలాలను పరిశీలిస్తున్న శాస్త్ర వేత్తలు

- డీడీఏ శివన్నారాయణ

కొడవలూరు: జీవన ఎరువులు లాభదాయకమని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివన్నారాయణ తెలిపారు. మండలంలోని బసవాయపాళెంలో ఆత్మ ద్వారా పంపిణీ చేసిన జీవన ఎరువులతో అల్లూరు లింగారెడ్డి సాగుచేస్తున్న వరి పొలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన ఎరువులైన అజోస్పైరిల్లమ్, ఫాస్ఫరస్, సెల్యుబులైజింగ్ బ్యాక్టీరియా, పొటాషియం మొబిలైజింగ్ బ్యాక్టీరియాలను మాత్రమే వరి పంటకు వినియోగించినట్లు తెలిపారు. ఎలాంటి రసాయన ఎరువులను ఉపయోగించకపోయినప్పటికీ పంట ఎంతో ఆరోగ్యకరంగా ఉందని చెప్పారు. జీవన ఎరువులతో ఆరోగ్యకరమైన ధాన్యం దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఈ ధాన్యానికి మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తాయన్నారు. ఎరువుల ఖర్చు గణనీయంగా తగ్గడం వల్ల రైతు బాగా లాభపడవచ్చన్నారు. ఆయన వెంట జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతిదేవి, ఏఓ శైలజకుమారి, శాస్త్రవేత్త విజయకుమార్ నాయక్, ఎంఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, వీఏఏ కే విష్ణుప్రియ, రైతు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

వరి పొలాల పరిశీలన

విడవలూరు: మండలంలోని దంపూరులోని వరి పొలాలను జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివనారాయణ, ఏడీఏ మారుతిదేవి శుక్రవారం పరిశీలించారు. వరిలో ఆకుమచ్చ, ఆకు ముడత తెగుళ్లు ఉన్నట్లు గుర్తించి నివారణ చర్యలను రైతులకు సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు విజయకుమార్, శైలజ, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భారత్ కార్డుల ఈకేవైసీని పూర్తిచేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వసుమతి

మనుబోలు: ఆయుష్మాన్ భారత్ కార్డుల ఈకేవైసీని వెంటనే పూర్తి చేయాలని డీఎల్‌డీఓ వసుమతి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయుష్మాన్ భారత్‌పై శుక్రవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 11,313 ఆయుష్మాన్ భారత్ కార్డులను జారీ చేసినట్లు తెలిపారు. అందులో ఇప్పటి వరకు 6,256 కార్డులకు మాత్రమే ఈకేవైసీ పూర్తి చేశారని చెప్పారు. ఇంకా 5,057 కార్డులకు ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. వలంటీర్ల సాయంతో త్వరితగతిన మిగిలిన కార్డులకు ఈకేవైసీ పూర్తిచేయాలని సూచించారు. ఈకేవైసీ పూర్తయితేనే కార్డులు పనిచేస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

పశు అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏడీ కృష్ణమౌర్య

కోవూరు : రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చిన పశుఅంబులెన్స్ సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణమౌర్య అన్నారు. స్థానిక శాంతినగర్‌లోని పశువైద్యశాల సమావేశ మందిరంలో పశు అంబులెన్స్ సేవలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించిన పాడి రైతులు అత్యవసర పరిస్థితుల్లో 1962 నంబర్‌కు కాల్ చేసి పశువైద్యసేవలను పొందవచ్చని తెలిపారు.పశువైద్యులు జేవీ చంద్రమోహన్, ప్రీతి, సురేష్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సెప్సిస్‌పై అప్రమత్తత అవసరం



సమావేశానికి హాజరైన వైద్యులు

నెల్లూరు సిటీ: శరీరంలో రోగ నిరోధక వ్యవస్థ, అవయవాలకు హాని కలిగించే సెప్సిస్ ఇన్‌ఫెక్షన్‌పై అప్రమత్తత అవసరమని ఇండియన్ సొసైటీ క్రిటికల్ కేర్ మెడిసిన్, నెల్లూరు చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, సెక్రటరీ డాక్టర్ కోటేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో డాక్టర్లకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వారిపై ఇది ప్రభావం చూపుతుందన్నారు. సెప్సిస్ చికిత్సకు యాంటీబయోటిక్స్, ఫ్లూయిడ్స్, వ్యాక్సిన్లను వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సతీష్, దినకర్, ప్రసాద్, చైతన్య, షాఫిక్ పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు పోస్టల్ సేవల విస్తరణ



బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రసాద్

ఉదయగిరి: జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు సైతం పోస్టల్ సేవలు విస్తరిస్తున్నట్లు నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్ఆర్ కేహెచ్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక తపాలా కార్యాలయ ఆవరణలో జరిగిన ఉదయగిరి సబ్ డివిజన్ తపాలా లక్ష్యాల సాధన సమీక్షలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల లబ్ధిదారులకు నేరుగా చేస్తున్న నగదు బదిలీ ప్రయోజనాలను వారు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే పొందాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకు సేవలను పల్లెలకు విస్తరిస్తోందన్నారు. సీతారామపురం మండలం దేవమ్మచెరువులో ఇటీవల బ్రాంచ్ పోస్టాఫీసును ప్రారంభించామన్నారు. పోస్టల్ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. పోస్టల్ పేమెంట్ బ్యాంక్ జిల్లా మేనేజర్ బి.సుధాకర్ మాట్లాడుతూ ఆధార్ అనుసంధాన చెల్లింపులతో పాటు, పెన్షనర్లకు జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికెట్లు తదితర పథకాల సేవలందిస్తున్నామన్నారు. అనంతరం లక్ష్యాలు సాధించిన సిబ్బందికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వి.సాయికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సుల దూకుడుకు కళ్లెం



డిపో ఎదుట ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ప్రైవేట్ బస్సును ఆపిన డీఎం కరీమున్నీసా

ఆత్మకూరురూరల్: ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ యజమానుల దురాగతానికి ఆర్టీసీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, ప్రైవేట్ బస్సుల దూకుడుకు కళ్లెం వేసింది. నిబంధనల ప్రకారం ప్రైవేట్ ట్రావెల్స్ ఆర్టీసీ డిపోలు, బస్టాండ్‌లకు మూడు కిలోమీటర్ల దూరంలో పాయింట్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. అయితే ఇటీవల కొన్ని ప్రైవేట్ బస్సులు, ఆర్టీసీ డిపో పరిసరాల్లో ప్రయాణికులను ఎక్కించుకొని బెంగళూరు, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు తీసుకెళ్తుండడంతో సంస్థ ఆదాయానికి గండి పడుతోంది. ఈ నేపథ్యంలో ఆత్మకూరు ఆర్టీసీ సీఐ కల్పన గత మూడు రోజులుగా ప్రైవేట్ బస్సులను కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో డిపో మేనేజరుతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల యూనియన్లు ఏకమై శుక్రవారం రాత్రి బెంగళూరు వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సును ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఎదుటే నిలిపి చట్టపరమైన చర్యలకు ఉపక్రమించారు. ఆత్మకూరు ఆర్టీసీ బస్సు మేనేజరు కరీమున్నీసాతో సహా ఉద్యోగ సంఘాలు ఏకమై నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేట్ బస్సులపై ఉక్కు పాదం మోపారు. దీంతో ప్రైవేట్ బస్సులకు సంబంధించిన కొంత మంది వ్యక్తులు రంగ ప్రవేశం చేసి ఆర్టీసీ యజమాన్యంతో వాగ్వాదానికి దిగి తమ దురాగతాన్ని కొనసాగించేందుకు ప్రయత్నించారు. అయితే ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు తీవ్రంగా ప్రతిఘటించడంతో వారు చేసేదేమి లేక మిన్నకుండిపోయారు. ఒక దశలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో ఆత్మకూరు ఎస్సై ముత్యాలరావు తన సిబ్బందితో రంగ ప్రవేశం చేసి పరిస్థితులను చక్కదిద్దారు. నిబంధనల ప్రకారం ఆర్టీసీ డిపోకు మూడు కిలో మీటర్ల పరిధిలో ప్రైవేట్ బస్సులు తిరగరాదని, ఇకపై ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.